# మా తెలుగు తల్లికి మల్లెపూదండ

(సంగీత, సాహిత్య రూపకం)




రచన, దర్శకత్వం

'సారస్వతకళానిధి'



**డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి**

ఎం.ఏ., పిహెచ్.డి. తెలుగు, ఎం.ఏ. సంస్కృతం

# MAA TELUGU THALLIKI

# MALLE PUDANDA

(A Literary, Musical drama)

By

**SARASWATHA KALANIDHI**

**Dr. VELUVOLU NAGARAJYA LAKSHMI**

February 2018

Address
Dr. Veluvolu Nagarajya Lakshmi
301, Ramanna Tower
1st Line Ramanna pet
Guntur – 522 007
Mail : rajyalakshmiveluvolu@yahoo.com
Mobile: 9394113848

# మనసున పూచిన మల్లియలు

''ఆంధ్రత్వమాంధ్రభాషా చ నాల్పస్యతపసః ఫలమ్'' అని 'సుందర తెలుంగు' అని ''ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్'' అని భాషేతరులచేత, పరదేశీయులచేత అమితమైన ప్రశంసలనందుకొని 'దేశభాషలలో ఉత్తమమైనదిగా నిలిచిన భాష తెలుగు. తెలుగు భాషను, తెలుగు నేలను, తల్లిగా భావించి పూజించటం తెలుగు వారి సంప్రదాయం. అజంతరూపమై, సంగీతానికి అనువైనదై తెలుగు సంస్కృతిని ప్రతిబింబించే సంప్రదాయానికి సరిజోడుగా కీర్తిగన్నది తెలుగు భాష. తెలుగు తల్లి ఒడిలో ముద్దులొలికే అపురూపమైన శిల్పసందప, జాతికి ప్రాణం పోసే నదీనదాలు, కనులవిందు చేస్తాయి. శౌర్య, ధైర్య పరాక్రమాలతో, సంస్కృతి, సంప్రదాయాలతో, బుద్ధి వైశారద్యంతో, కమనీయ కవితలల్ల గల ప్రతిభతో, భక్తి భావ గరిమతో విలసిల్లిన మహనీయులను, మహిళా శిరోమణులను కన్నతల్లి తెలుగు నేల. మధురమంజులమైన రూపురేఖలతో విరాజిల్లుతున్న తెలుగు తల్లికి, మల్లెల భావపరీమళాలతో కూడిన పూదండను నిండుగా అలంకరించిన వారు శ్రీ శంకరంబాడి సుందరాచార్యులు. ''మా తెలుగు తల్లికి మల్లెపూదండ కీర్తన తెలుగు తల్లి వైభవానికి నిలువెత్తు కీర్తిసరం. ఆ కీర్తనలో సుందరాచారి గారు వర్ణించిన కృష్ణా, గోదావరీ నదీలలామలు, త్యాగయ్య, తిక్కన్నలు రుద్రమ్మ, మల్లమ్మలు, తిమ్మరుసు, కృష్ణరాయలు ఒకే వేదికపై ప్రత్యక్షమైతే అనే భావన ఈ రూపక రూపకల్పనకు ప్రేరణ నిచ్చింది.

గుంటూరు తిరుపతిగా పేరందిన గుంటూరు బృందావన్ గార్డెన్స్ లోని శ్రీ పద్మావతీ గోదాదేవీ సమేత శ్రీవేంకటేశ్వరదేవాలయం కోరిన వారికి కొంగుబంగారమై విరాజిల్లుతోంది. ఆధ్యాత్మిక భావపరీమళాలు ఒకవంక, సామాజిక సేవానిరతి మరొకవంక, సంగీత, నృత్య కళాభినయ విన్యాసాలు ఒక చెంప, సాహిత్య సమాలోచనలు మరొక చెంప, ఇవి, అవి అని వర్ణింపనలవి కాని బహువిధ కార్యక్రమాలకు వేదిక అన్నమయ్య కళావేదిక దేవాలయ ప్రాంగణానికి గొప్పవేడుక. అంతటి ప్రతిష్టాత్మకమైన వేదికపై 21-2-2018, అంతర్జాతీయ మాతృ భాషాదినోత్సవాలలో ప్రప్రథమంగా ఈ వినూత్న రూపకం నా పర్యవేక్షణలో ప్రదర్శన భాగ్యాన్ని పొందింది. అది నాకు అమితానందాన్ని కలిగించింది. సాహిత్యరూపక నిర్మాణంలోను, దర్శకత్వ నిర్వహణలోను నా ప్రతిభ పలువురిని అలరించింది. ఎనలేని ప్రశంసల జల్లులో నేను తడిసిపోయాను. అచ్చటి రసజ్ఞ ప్రేక్షకులందించిన ప్రోత్సాహంతో ఈ రూపకానికి పుస్తక రూపాన్ని అందించాలన్న ఆకాంక్షతో మీ ముందుకు తీసికొని రావటం నాకు మహోత్కృష్టమైన స్ఫూర్తిని కలిగించింది.

ఈ రూపక రచనలో నాకు పరిపూర్ణ సహకారం అందించిన నా ప్రియమిత్రులు డాక్టర్ మైలవరపు లలిత కుమారి గారికి, డాక్టర్ వేమూరి సత్యవతిగారికి హృదయపూర్వక కృతజ్ఞతలు.

నా ఈ రూపకానికి అందమైన ముద్రణ రూపాన్ని అందించి సహకరించిన శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవాలయం, అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయ సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు.

**రచయిత్రి**

**డా॥ వి. నాగరాజ్యలక్ష్మి.**

గుంటూరు,
3-9-2018, శ్రీ కృష్ణాష్టమి పర్వదినం.

# మా తెలుగుతల్లికి మల్లెపూదండ

కలభాషిణి (ప్రయోక్త):

''ఓంకారస్వరజన్యమై, ప్రథితవేదోక్త స్వధర్మ క్రియా
హుంకారాశయ ధన్యమై, సుకవితా హోమాగ్ని శబ్దార్ధధూ
మాంకూరోద్గత భావసౌరభ ఋతోద్యచ్చిత్కళామాన్యమై
శంకా పంకిల శూన్యమౌ తెనుగుబాసం గొల్తుబల్తీరులన్''

(విశ్వనాథ సత్యనారాయణ)

''తేనెకన్న తీయతీయని తెలుగుభాషకు వందనం
తేటమాటల ఊటయౌమన తెలుగు పాటకు వందనం
తెలుగు చిలుకలు పలుకుతుంటే / తెలుగు చిగురులు కదలుతుంటే
తెలుగు గాలికి పరవశించే / తెలుగుతోటకు వందనం
తెలుగువీరుల రక్తధారలు / కణములందున దాచుకుంటూ
అరుణ రాగము ప్రజలకిచ్చే తెలుగు నేలకు వందనం
ఇతర భాషలు దాడి చేస్తూ / తెలుగు భాషను తరిమివేస్తే
ఉద్యమాలకు ఊపిరిచ్చే / తెలుగు తల్లికి వందనం''

(అద్దేపల్లి రామమోహనరావు)

**ప్రయోక్త:** సభాసరస్వతికి సహస్రాభివందనాలు

మధుబిందువులకన్న, మకరందం కన్న మధురమైనది మన తెలుగు భాష. ఎందరో మహానుభావులు ఈ భాషామతల్లికి మోకరిల్లి. ఈ తెలుగు సరస్వతి సన్నిధిలో తరించి అనుభవైకవేద్యమైన తమ అనుభూతులకు అక్షర రూపం కల్పించారు. ప్రపంచ భాషల లిపులలో తెలుగు లిపి సుందరమైనదని పరదేశ భాషా శాస్త్రజ్ఞులు తమ పరిశోధనలో నిరూపించారు. బ్రిటిష్ శాస్త్రవేత్త జె.బి.యస్. హాల్డేన్ తెలుగు భాష ఔన్నత్యాన్ని గుర్తించి భారతదేశ ప్రాంతీయ భాషలలో తెలుగు జీవభాషయని, విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాల బోధనకు అనువైన భాషయని, భారతదేశానికి అధికార భాషకాగల యోగ్యత కలిగిన భాషయని పేర్కొన్నారు. తేనెలొలుకు తెలుగుభాషను కవి పండితులెందరో బహురీతుల సంభావించారు.

''తలచినంతనె తన్మయత్వము కల్గి
తీపినొందించు పీయూష తెలుగు భాష
చదివినంతనె మదిలోన సుధలు గురియు
దివ్యకావ్య సమున్మేష తెలుగుభాష''

అనే కవిసమ్రాట్ విశ్వనాథవారి భావన పరమసత్యం. తెలుగు భాషను, తెలుగుగడ్డను మాతృదేవతగా అర్చించటం, జాతికి జీవం పోసే ప్రాణ శక్తిగా ఆరాధించటం తెలుగు వారి సంస్కృతివైశిష్ట్యం. తెలుగు భాష మాధుర్యాన్ని, తెలుగు జాతి ఔన్నత్యాన్ని ఎంతమంది గాయకులు ఎన్ని రీతులలో ఆలపించినా శ్రీ శంకరంబాడి సుందరాచారి రచించిన ''మా తెలుగుతల్లికి మల్లెపూదండ'' గీతం అక్షరాల తెలుగుతల్లి గళసీమలో అరవిరిసిన బొండు మల్లెల దండను అలంకరించింది.

1942లో ''దీనబంధు' చలన చిత్రం కోసం ఈ గీతం రచింపబడింది. లలిత లలితమైన ఈ గీతం టంగుటూరి సూర్యకుమారి గారి గాత్రంలో మధురమధురమైన సరాగాలు కూర్చుకొని శ్రావ్యతను సింగారించుకున్నది. 1975లో తొలి తెలుగు ప్రపంచ మహాసభలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ గీతాన్ని రాష్ట్రగీతంగా ఆధికారికంగా ప్రకటించింది. ప్రతిష్టాత్మకమైన ఈ గీతంలో తెలుగునెల మాతృమూర్తిగా సంభావింపబడింది. తెలుగుతల్లి సిరులొలికే బాహ్యారూపమూ, కరుణా ప్రపూర్ణమైన ఆ జనని అంతరంగమూ, తెలుగుగడ్డ వైభవమూ దీనిలో అభివర్ణింపబడ్డాయి. రసజగత్తును సృష్టించిన తెలుగుతల్లి ముద్దుబిడ్డలు సంగీతనిధి త్యాగయ్య, సాహిత్యధుని తిక్కన ప్రశంసింపబడ్డారు. తెలుగుతేజోమూర్తులైన రుద్రమ్మ, మల్లమ్మ, కృష్ణదేవరాయలు, తిమ్మరుసుల కీర్తిపతాకలు ఈ కీర్తనలో రెపరెపలాడతాయి.

ప్రతి ఆంధ్రుని హృదయాన్ని ఆనందింపచేసి నరనరాన తెలుగుతల్లిపై భక్తిభావతరంగాలను ప్రవహింపచేసే ఈ గీతానికి ముగ్ధమనోహరలైన యువతులు అందిస్తున్న నృత్యాన్ని తిలకించండి.

(మా తెలుగు తల్లికి మల్లెపూదండ గీతనృత్యం)

**ప్రయోక్త:** దేవేంద్ర సభలోని దివ్యకాంతలే స్వయంగా దిగివచ్చి ఈ వేదికపై అపురూపమైన నృత్యాన్ని ప్రదర్శించిన అనుభూతిని కలిగించారు ఈ ముద్దుగుమ్మలు. తెలుగుతల్లి కనుచూపులోని కరుణ వీరిపై అమృతపుసోనలై వర్షించునుగాక.

రసజ్ఞులారా! ఈ గీతంలోని నదీమతల్లులు, కళానిధులు, పరాక్రమోపేతులు, ధీమంతుడైన తిమ్మరుసు, కీర్తిమంతుడైన కృష్ణరాయలు స్వయంగా ఈ వేదికపై ప్రత్యక్షమైతే, తెలుగుబిడ్డలకు ఆశీర్వచనసంపత్తిని అనుగ్రహిస్తే ఎంత అద్భుతంగా ఉంటుంది? అతిలోకమనోహరమైన ఆ అపూర్వ సన్నివేశాన్ని కనులారా వీక్షించి మైమరచిపోవలసినదే. ఆ మధుర భావనయే వినూత్న సాహితీరూపకమై ప్రేక్షకులను రసాంబుధిలో ఓలలాడించబోతున్నది.

స్వర్ణ గర్భ అయిన తెలుగుతల్లి కరుణతో గలగలా ప్రవహిస్తున్న గోదావరి, బిరబిరా పరుగులిడుతున్న కృష్ణమ్మ తల్లి కడుపులో దాగిన పసిడిరాశులను బిడ్డలకు కానుక చేస్తున్నాయి అదిగో గోదారమ్మ. వెన్నెల పారిజాతమై విచ్చేస్తున్నది. గోదావరి! నీరాక ఆంధ్రులకు ఏరువాక, ఇదిగిదిగో కృష్ణమ్మ ఒంపుసొంపులతో ఒయారంగా కదిలివస్తున్నది. నదీమతల్లులారా! మీకిదే మా శుభాహ్వానం.

(గోదావరి, కృష్ణవేణి రంగస్థలంపైకి విచ్చేసి ఇరువురు ఒక్కమారే)

తెలుగుతల్లీ! నీకివే శతకోటి నమస్సులు. కరుణాతరంగిణీ! నీకు మా నీరాజనాలు.

**కృష్ణమ్మ:** సఖీ! గోదావరీ! శ్రీనివాసుడు కొలువుతీరిన ఈ పవిత్ర ప్రాంగణంలో మన తెలుగుతల్లికి ముందుగా అభి వందనాలు తెలుపుకుందాం.

ఇద్దరు: అభివందనాలు కలభాషిణీ!

**కృష్ణ:** గోదావరీ! నీ రాకతో ఆంధ్రదేశం పులకించింది. తెలుగు నేల సస్యశ్యామలమై తన బిడ్డల ముద్దుమురిపాలలో పరవశించిపోతున్నది. ఈ పవిత్ర భూమితో నీకు ఏర్పడిన అనుబంధాన్ని నీ పలుకులలోనే వినిపించునెచ్చెలీ!

**గోదావరి:** అవశ్యం కృష్ణవేణీ! దక్షిణ గంగగానన్ను తెలుగువారు సంభావిస్తారు. లోక కళ్యాణార్థమై గౌతముడు చేసిన తపస్సునకు మెచ్చి పరమేశ్వరుని అనుగ్రహంతో

గౌతమిగా ఆంధ్రులకు చేరువయ్యాను. నాతీరం అంతా ఆధ్యాత్మిక పరిమళాలు గుబాళిస్తున్నాయి. భద్రాచలంపై సీతారామ చంద్రస్వామి కొలువుతీరి నాకు ఘనకీర్తిని ప్రసాదించాడు. పంచారామాలలో దాక్షారామం, కుమారారామం, క్షీరారామం, సోమారామం – నాలుగు ఆ రామాలు నా తీరంలోనే వెలశాయి కదా. సీతారాములు నయన మనోహరంగా విడిది చేసిన దృశ్యాలు నేటికీ నా కనుల ఎదుట నర్తిస్తున్నాయి. ''ఇయంగోదావరీరమ్యా' అని సాక్షాత్తు రామచంద్రమూర్తి నన్ను ప్రశంసించాడు.

**కృష్ణ:-** గౌతమీ! నీ సంచారం వలన ఆంధ్రదేశానికి ఎనలేని ఖ్యాతి లభించింది. వేదం వంటి నీ తరంగఘోషను ఆలకించి పునీతుడైన వాగనుశాసనుడు పంచమ వేదమైన మహాభారతాంధ్రీకరణకు శ్రీకారం చుట్టాడు.

**గోదావరి:-** అవును కృష్ణవేణీ! నా తీరంలో వెలసిన రాజమహేంద్రవరం కళలకు కాణాచి. కవులకు, పండితులకు, స్వాతంత్ర్యోద్యమ సారథులకు. సంఘ సంస్కర్తలకు నిలయమై భాసిల్లుతుంది. ధవళేశ్వరంపై కాటను నిర్మించిన ఆనకట్టవలన ఎడారి భూములను సుక్షేత్రాలుగా మలచగలుగుతున్నాను. ఆధ్యాత్మిక, సాంఘిక, విద్యా, రాజకీయ రంగాలలో తెలుగువారితో అవినాభావమైన అనుబంధాన్ని పెనవేసుకున్నాను.

**కృష్ణ:-** ధన్యమూర్తివినెచ్చెలీ! ఎన్నెన్నో విశేషాలు నీ ప్రవాహంలో పరవళ్ళు త్రొక్కుతూ బిడ్డలను ఆనందడోలికలలో విహరింపచేస్తున్నాయి.

భూకాంతామణి శిరస్సున ధరించిన ముత్యాలపాపట బొట్టులా, యశోధరయైన భూదేవి కొప్పులో పెట్టుకున్న పూల చెండులా, భూమాత ఎదపై కప్పుకున్న పైట చెరగులా నీవు ప్రకాశిస్తున్నావు.

''స్థిర పుణ్యోదయ మేదినీందు వదనా సీమంత వీథీలస
ద్గురు ముక్తాఫలసూత్రమో! సురుచితక్షోణీపురంధ్రీయశో
ధర ధమ్మిల్ల లతాంత మాలికయో! భూత స్వీకుచశ్రీమనో
హర సంధ్యానమో నాగ నీదగు ప్రవాహంబొప్పుగోదావరీ!

అని తెలుగు బిడ్డ ఎఱ్ఱగడపల్లి పోతయ్య నిన్ను ప్రశంసించిన ముచ్చట నాకు మనోల్లాసాన్ని కలిగిస్తుంది.

**గోదావరి:-** ధన్యురాలను కృష్ణవేణీ! తెలుగు నేల నిన్ను మనసారా ఆహ్వానించింది. తెలుగు తల్లి నిండు మనస్సుతో ఆశీర్వదించింది. తెలుగింటి విరిబోణివై నీవు విలసిల్లుతున్నావు.

**కృష్ణ:-** అ తల్లి అనుగ్రహంతో నీవన్నట్లు తెలుగు గడ్డతో నాకును అనాదిగా అనుబంధం ఏర్పడింది నెచ్చెలీ! తెలుగు గడ్డపై నేను అడుగిడిన ప్రదేశం నుండి నా తీరం అంతటా భారతీయ సంస్కృతి, నాగరికతలు పరిఢ విల్లాయి. పంచారామాల్లో ప్రథమమైన అనురావతిలో అనునిత్యమూ ఆపరమేశ్వరుని నా జలాలతో అభిషేకించే పుణ్యాన్ని వరంగా పొందాను సఖీ! విజయవాటికా నగరంలో జగన్మాత అండనే నేను ప్రవహిస్తూ ఆంధ్రులకు ఆరాధ్యనయ్యాను. మధురమధురమైన నా జలాలతో నా బిడ్డలకు సుసంపన్నమైన జీవనాన్ని అందించే భాగ్యం నాకు కలిగింది.

**గోదావరి:-** మహావీరులైన రాజన్యులెందరో నీ తీరాన రాజధానులు నిర్మించుకున్నారు కదా కృష్ణవేణీ!

**కృష్ణ:-** చక్కగా జ్ఞాపకం చేశావు. అమరావతి చెంతనున్న ధాన్య కటకం ఆంధ్రశాతవాహనుల తొలిరాజధాని. అంతేకాదు గోదావరి! నేడు కూడ నా తీరమందే దేవేంద్రుని అమరావతిని పోలిన ఆంధ్రుల రాజధాని అమరావతి సర్వాంగ సుందరంగా నిర్మింపబడుతున్నందుకు నేనెంతో గర్విస్తున్నాను.

**గోదావరి:-** కృష్ణవేణీ, సౌందర్యం, సౌశీల్యం, సంస్కృతి నీ రూపాలుగా విరాజిల్లుతున్నావు.

''కృష్ణాతరంగ నిర్నిద్రగానముతోడ
శిల్పమ్ము తొలిపూజ సేయునాడు
అక్షర జ్ఞాన మెఱుగదోయాంధ్రజాతి
విమల కృష్ణానదీ సై కతముల యందు
కోకిలపు బాట పిచ్చుక గూండ్లు కట్టి
నేర్చుకొన్నది పూర్ణిమా నిశలయందు

అని కవి సమ్రాట్ విశ్వనాథ పలికిన పలుకులు సజీవ సాక్ష్యాలు కదా. నీచలువతో అక్షర జ్ఞానం, నాగరికత అబ్బింది తెలుగు జాతికి. ఇంతకంటే జన్మ సాఫల్యం ఇంకేముంటుంది! నీవు ఇతోధికంగా వర్ధిల్లుదువుగాక.

**కలభాషిణి:-** కృష్ణవేణీ! నీసౌందర్యానికి ముగ్ధురాలనై నీ తీరంలో నేను నడచివస్తూ ఉండగా నదుల అనుసంధానం అనే అంశాన్ని జనులు ముచ్చటించుకోవటం విన్నాను. ఏమా విశేషం తల్లీ!

**కృష్ణ**:- కలభాషిణీ! నదుల అనుసంధానం ఒక అద్భుతమైన, విశ్వశ్రేయఃకరమైన ప్రక్రియ. ఒక ప్రాంతంలోని బిడ్డలు క్షామంతో అల్లాడటం, వేరొక ప్రాంతంలోని బిడ్డలు విలాసాలలో మునిగితేలటం సమంజసంకాదు. కనుక మేము అనుసంధానంపొంది ఆంధ్రులందరి జీవితాలలో సమతుల్యతను పరరక్షిస్తున్నాం. తెలుగు బిడ్డల సర్వతోముఖాభివృద్ధికి దోహదం చేస్తున్నాం. పరమేశ్వరుని అనుగ్రహంతో భిన్నభిన్న ప్రాంతాలలో నివసించే జనులంతా సహోదరభావంతో, సుఖసంతోషాలతో జీవన యాత్రను సాగించలన్నది దీని అంతరార్ధం.

**కలభాషిణి:-** వేదమంత్రాలే అలలుగా ప్రవహిస్తూ, తెలుగు నేలను పునీతం కావిస్తూ తెలుగు తల్లి సిగపాయలలో రత్నభూషలైన నదీరమణులారా! మీకు శుభాభి నందనలు.

**గోదావరి,కృష్ణలు:-** కలభాషిణీ, నీకు ధన్యవాదాలు. తెలుగుతల్లికివే మా నమస్సుమాంజలులు (అని ఆసీనులవుతారు.)

రసజ్ఞ పారిషదులారా! మన అమరావతి సుసంపన్నమైన నగరం. తెలుగు రాజుల ఏలుబడిలో, అపూర్వమైన సాంస్కృతిక వైభవంతో అలరారుతోంది. అమరావతి శాసనాలలో ప్రప్రథమంగా 'నాగబు' అనే తెలుగుపదం కనిపించింది. తెలుగు భాషా ప్రాచీనతకు ఇది తార్కాణం. ఇచటి అపురూపశిల్పాలు దక్షిణ భారతీయ శిల్పరీతికి ఒజ్జబంతులుగా నిలిచాయి. అత్యంత ప్రాచీనమైన గౌరవంతో అలరారుతున్న మన తెలుగు భాష అటు సంగీతానికి, ఇటు సాహిత్యానికి అనువైనది.

''పాటకును పద్యమునకు నమ్రముగ నొదిగి
చవికి చాతుర్యమునకు సాజముగ సాగి
పోరునకు పొత్తునకు చాలి పొంది పొసగు
మా తెనుగుతల్లి మెడకిదే మల్లెదండ''

అనే రాయప్రోలు పలుకులు సార్థకమైనవి కదా.

నిధికంటె రాముని సన్నిధి చాల సుఖమని భావించిన త్యాగయ్య కీర్తనల్లో అచంచలమైన భక్తి, అమృతధారవంటి సాహిత్యం, నిర్మల కావేరీ ప్రవాహం వంటి సంగీతం జీవం పోసుకున్నాయి. తీయని తెలుగు దనాన్ని కైతలో పండించిన కవిబ్రహ్మ తిక్కన సోమయాజి.

అదిగో నాదబ్రహ్మ త్యాగయ్య – కవిబ్రహ్మ తిక్కన విచ్చేస్తున్నారు. తేజోమూర్తులారా! మీకు శుభస్వాగతం.ఆసీనులుకండు.

(త్యాగయ్య తిక్కనలు ప్రవేశించి) తెలుగుతల్లీ! నీకివే మా నమో వాకములు - కలభాషిణీ! నీకు మా శుభాభినందనలు.

**తిక్కన:-** ఎదనిండా పదిలంగా శ్రీరామచంద్రమూర్తి రూపాన్ని ప్రతిష్ఠించుకొని నాదోపాసన ద్వారా ఆత్మసాక్షాత్కార భాగ్యాన్ని పొందిన మహాభక్తశిఖామణీ! త్యాగరాజ స్వామీ! మీకివే నా నమస్సులు. తెలుగుతల్లి అనుగ్రహంతో కోనేటి రాయని కొలువులో కాలానికతీతంగా మిమ్ములను దర్శించే అదృష్టం కలిగింది. తెలుగు భాషలో పదసాహిత్యాన్ని పరిపుష్టం చేసిన పుణ్యాత్ములు మీరు. సంగీతంలో మీరు ప్రవేశ పెట్టిన ప్రయోగాల్లో సంగతులు ప్రధానమైనవని విన్నాను. ఏమా సంగతి త్యాగరాజులవారూ!

**త్యాగయ్య:-** తిక్కయజ్వ కవీంద్రులకు అభివాదాలు. మహాకవీ! రాగ భావాన్ని విస్తరింపచేస్తూ క్రమంగా పెంచుకుంటూ సాగే ప్రక్రియను ‘సంగతి’ అని వ్యవహరిస్తారు. సాహిత్యంలోని అంతరార్థాన్ని మరింత ప్రస్ఫుటం చేయటానికి సంగతులు ఉపకరిస్తాయి. అనంతర వాగ్గేయకారులు ఈ మార్గాన్ని అనుసరించారు.

**తిక్కన్న :-** గోదావరి జలపానం వలన కవిత్వం వస్తుందని, కావేరీ నదీ జలపానం వలన సంగీతం వస్తుందని జనులలో ప్రగాఢమైన విశ్వాసం. త్యాగరాజా! మీరు కావేరీ తీరవాసులేకదా. సుప్రసిద్ధవైష్ణవ క్షేత్రమైన శ్రీరంగాన్ని దర్శించినప్పుడు మీరు ఆలపించిన ‘పంచరత్నకీర్తనలు’ జగత్ప్ర సిద్ధి పొందాయి కదా.

**త్యాగయ్య:-** ఆ శ్రీరంగనాథుని కరుణాకటాక్ష వీక్షణం వలన భాషామతల్లి నా జిహ్వపై నర్తించింది. అంతరంగంలో కొలువు తీరిన పరమాత్మను ఘనరంగ పంచరత్నమాలికగా పలికించింది.

‘‘**ఎందరో మహానుభావులు / అందరికీ వందనములు** (2 సార్లు) అంటూ చంద్రుని మొదలు చంద్రధరుని వరకూ, దిక్పాలుర నుండి వాక్పతి వరకు, తుంబుర నారదాది గానమూర్తులకు, ప్రహ్లాదాది బాల భక్తులకు అందరికీ వందనాలు సమర్పించుకున్నాను కవీ!

**తిక్కన:-** త్యాగరాజస్వామి సాక్షాత్తు ‘నాదపరమేశ్వరుడని’ పండిత వరేణ్యులంతా కీర్తించారు కదా. ఆ విశేషాలను వినిపించండి. త్యాగరాజా!

**త్యాగయ్య:-** ఆనాడు తిరుమలలో స్వామిదర్శనం కోసం అలమటించిన నేను ఇలా పాడుకున్నాను.

‘‘తెరతీయగరాదా – (కీర్తన పల్లవి)

అని నాదస్తుతి కావించాను.

మరొకమాట మహాకవీ! శైవ, వైష్ణవాలయాలలో ఉత్సవ మూర్తులకు సేవలు చేసే సందర్భాలలో సంస్కృతస్తోత్రాలే ప్రముఖంగా వినిపించేవి. కాలక్రమంలో తిరుమల క్షేత్రంలో తేనెలొలుకు తెలుగుభాషకు చోటు లభించింది. ఏకాంతసేవ, నీరాజనం, మేలు కొలుపు పాటలలో తెలుగుతల్లి అనుగ్రహంతో నేను స్వామికి నాదకైంకర్యం చేయగలిగాను.

**తిక్కన:-** త్యాగయ్యా! మీ కీర్తనలలో తెలుగు తల్లి గజ్జె కట్టి నాట్యం చేసింది.మీరెంతటి పుణ్యాత్ములో. నాకు అమిత ప్రీతిపాత్రమైన కీర్తన మీ నోటి వెంట వినాలని ఉన్నది. ‘‘మా జానకీ చెట్టుబట్టగా’’

**త్యాగయ్య:-**

‘‘మా జానకి చెట్టబట్టగా మహరాజువైతివి
రాజరాజవర! రాజీవాక్ష! విను
రావణారియని రాజిల్లురీతి మా జానకి చెట్టబిట్టగా మహరాజువైతి

ఓ శ్రీరామా! మా జానకి చెట్టబట్టగా –

**తిక్కన:-**ఆహా! సీతారాముల పవిత్ర కళ్యాణ శుభసన్నివేశం కన్నుల పండువుగా సాక్షాత్కరిస్తున్నది. ఇంతటి పుణ్యాత్ములు, నాదబ్రహ్మాలు అయిన మిమ్ములను దర్శించిన మాత్రం చేతనే సమస్త పాపాలు నశించిపోతాయి.

నమోవాకాలు త్యాగరాజా!

**త్యాగయ్య:-** మీరు కవిత్రయంలో ద్వితీయులైనా కవిత్వ రచనలో అద్వితీయులుగా, ఉభయ కవిమిత్రులుగా ఆంధ్రుల ఆదరాభిమానాలను అందుకున్నారు. మీ కవిత్వపు తేనెలలోని తియ్యదనాన్ని తెలుగువారు మనసారా ఆస్వాదిస్తున్నారు. సొగసైన తేటతెలుగు పదప్రయోగంలోను, సుమధురమైన భావప్రకటనలోను, మనోహరమైన అలంకార భూషణంలోను, అభినయాత్మకమైన నాటకీయతలోను మీరు రంగరించి పోసిన తీయదనాన్ని ఏమని వర్ణించను మహాకవీ!

**తిక్కన:-** త్యాగయ్యా! 'ఆంధ్రావళి మోదముంబొరయునట్లుగ' మహా భారతాంధ్రీకరణ కావించాలని నాతలంపు.

పాండవులు అరణ్యవాస, అజ్ఞాతవాసాలను ముగించిన పిమ్మట శ్రీకృష్ణుని హస్తినకు రాయబారిగా పంపుతున్న సన్నివేశంలో తన ఆవేదనను, అంతవరకు అణచుకున్న అవమానాగ్నిని అన్న ఎదుట ద్రౌపది ఇలా నివేదించుకున్నది.

''వరమునబుట్టితిన్, భరతవంశమున జొచ్చితి, నందు బాండు భూ
వరునకు కోడలైతి, జనవంద్యుల బొందితి, నీతివిక్రమ
స్థిరులగు పుత్రులంబడసితిన్, సహజన్ములప్రాపు గాంచితిన్
సరసిజనాభ! యిన్నిటబ్రశస్తికి నెక్కిన దాన నెంతయున్''

**త్యాగయ్య:-** అద్భుతం మహాకవీ! ద్రౌపది ఆవేదన తీపి, కారం కలిసిన తియ్యదనంగా తెలుగువారిని అలరించింది.

మీ రచనాశైలిని 'రసాభ్యుచితబంధంగా' విజ్ఞులు పేర్కొన్నారు. ''నానారసాభ్యుదయోల్లాసి'' అని విరాటపర్వ విశిష్టతను మీరే వివరించారు కదా.

**తిక్కన:-** 'రసోవైసః' అని వేదవాక్కు. భగవంతుడు రసస్వరూపుడు. రసాత్మకమైన వాక్యమే కావ్యం కదా. నా కవిత్వంలోని రసమాధుర్యం రసపిపాసువులను ఆనందరసాంబుధిలో ఓలలాడించింది. ప్రధానంగా నాటకీయమాధుర్యం నా కవిత్యానికి అలంకారమై విలసిల్లింది.

**త్యాగయ్య:-** నీ నాటకీయతా మధురిమలను వినాలని కుతూహలంగా ఉంది. తిక్కన సోమయాజీ

**తిక్కన:-**అది విరాటరాజు ఆస్థానంలోని నర్తనశాల. కీచకుని వలన ద్రౌపది పొందిన భంగపాటునకు ప్రతీకారంగా నర్తనశాలలో కీచక వధకు పటిష్టమైన ప్రణాళిక రూపొందింపబడింది. ద్రౌపది కీచకుని నర్తనశాలకు ఆహ్వానించింది. కీచకుడు నవమన్మధునివలె అలంకరించుకొని సింహం ఉన్న గుహలోనికి అతిశీఘ్రంగా ప్రవేశించే మదగజంలా నర్తనశాల ప్రవేశించి మనస్సునిండా మోహం నింపుకొని ద్రౌపదికై నిరీక్షిస్తున్నాడు. భీముడు పెళ్ళికి వెళ్ళినంత ఉల్లాసంతో చీర ధరించి, కొంగు తలపై కప్పుకొని కాచుకొని ఉన్నాడు. భీముని ద్రౌపదిగా భావించిన కీచకుడు ఆమెతో తన పరాక్రమాదులను గొప్పగా చెప్పుకుంటూ ఉన్నాడు. ఆ మాటలు భీమునికి హాస్యఉద్దీపకాలు కాగా కీచకునికి ఈ విధంగా ఐదులు పలికాడు.

''నాయెడలు చేర్చినప్పుడు
నీయొడలెట్లగునొదాని నీవెఱగెదున
న్నేయబలల తోడిదిగా
జేయదలంచితివి తప్పు సేసితిగంటే''

ననుముట్టి నీవు వెండియు
వనితల సంగతికి బోవువాడవె! యైనం
దనువే బడసిన ఫలమే
కనియెదవిదె చిత్తభవ వికారములెల్లన్''

కలభాషిణి:- త్యాగయ్యా! మీపంచరత్న కీర్తనలు ముత్యాలలో ఆణిముత్యాలు. తిక్కయజ్వా! మీ తెలుగు కవిత్వపు తీయందనాలు ఇక్షురసాలు. ఆపాతమధురమైన

సంగీతాన్ని, ఆలోచనామృతమైన సాహిత్యాన్ని తెలుగుతల్లికి నీరాజనాలుగా సమర్పించిన పుణ్యమూర్తులు మీరు ధన్యులు. మీకు నా నమశ్శతాలు.

(త్యాగయ్య తిక్కనలు ఆసీనులవుతారు.)

కలభాషిణి:- సభాసదులారా! తెలుగుగడ్డపై కవి పండితగాయకులే కాదు. తమ శౌర్య, ధైర్య, సాహసాలతో, పతిభక్తితో ఈ నేలను పరిపూతమొనర్చిన మహిళాశిరోమణులెందరో చరిత్రనలంకరించారు.

అదిగో! తన భుజబలపరాక్రమాదులతో శత్రురాజులను అవలీలగా అణచివేసి రాజ్యపాలన కావించిన తెలుగురాణి రుద్రమ్మను మనం ఇప్పుడు దర్శించబోతున్నాం. రుద్రమ్మా! నీకు హృదయపూర్వకమైన ఆహ్వానం పలుకుతున్నాం.

ఇదిగో! సాధుశీలమల్లమ్మ. అసమానమైన తన చరితతో తెలుగుజాతి గౌరవదీప్తులను దశదిశలా ప్రసరింపచేసిన మల్లమ్మ- మ్మల్లమ్మా! విచ్చేయవమ్మా నీరాకకై సభ నిరీక్షిస్తున్నది.

(ఇరువురు వచ్చి తెలుగు తల్లిని పుష్పాలతో అర్చించి)

కలభాషిణీ! మధురమైన నీ ఆహ్వానానికి ముగ్ధులమైనాము. నీకు మా అభినందనలు.

మల్లమ్మ:- తెలుగురాణీ! శస్త్రాస్త్ర విద్యాధురీణవై, సామ్రాజ్ఞిగా వెలుగొందిన రుద్రమాంబా! నీ భుజశక్తి అమోఘం. నీ పరాక్రమం అనితర సాధ్యం. తెలుగుతల్లి కీర్తికిరీటంలో మరకత కాంతులను వెలయించిన నిన్ను దర్శించటం నేటి మహిళాలోకం చేసుకున్న పుణ్యవిశేషం. అసమానమైన నీ వీరవిహారాన్ని, నీ విజయగాథలను నీ పలుకులలోని వినాలని కుతుహలంగా ఉన్నది రుద్రమ్మా.

మగసంతానమే వారసులు – అనే చరిత్రను మార్చి మగువ కూడా మహ బాగా రాజ్యమేలగలదు! యుద్ధం చేయగలదు! యుద్ధ విద్యలు నేర్వగలదని చరిత్రను తిరుగ వ్రాసిన రాణిరుద్రమను నేను! బుద్ధి సూక్ష్మతతో, ఆత్మ బలంతోనే కాదు, శస్త్రాస్త్ర విద్యలు నేర్చి కదన రంగంలోనూ స్త్రీ ప్రళయ కాళిక వలె శత్రుసంహారం చేయగలదని నిరూపించాను! నా పితృ దేవులు గణపతి దేవ చక్రవర్తి నన్ను తీర్చి దిద్దిటమే కాదు, స్త్రీ శక్తి ఎంతమాత్రమూ తక్కువది కాదని నమ్మి నన్ను తన వారసురాలిగా ప్రకటించారు. అందుకు నేను ఉత్సాహంగా సంసిద్ధనైనాను!

విశ్వేశ్వర దేశికులు విద్యను నేర్పగా రేచర్ల రుద్రదేవుని వద్ద సైన్యం నడిపే శిక్షణను, వ్యూహరచను నేర్చాను. శివదేవయ్య వద్ద విలువిద్య, కత్తిసాము, గుఱ్ఱపుస్వారీ, అర్థశాస్త్ర దండనీతి విద్యలను నేర్చాను. జాయపసేనాని నన్ను నాట్య శాస్త్ర విశారదగా తీర్చిదిద్దారు. సభలలో, ఆంతరంగిక చర్చలలో పాల్గొంటూ రాజ్య నిర్వహణాంశాలన్నీ నిశితంగా గమనించాను! అనేక అంశాల పట్ల మంచి అవగాహన కలిగింది!

మొదటగా దట్టమైన అరణ్యాలలో దోపిడీ దొంగల పీడ గురించి స్పందించి నా వ్యూహరచనతో, ఖడ్గ చాలనంతో దొంగలకుత్తుకలనుత్తరించి వారి పీడ విరగడ చేశాను.

తర్వాత మా తండ్రి తిక్కన మహాకవికి చేసిన వాగ్దానాన్ని నిలబెట్టేలానెల్లూరు మనుమసిద్ధి రాజ్యం దాయాదుల నుంచి రాజ్యం తిరిగి కైవసం చేసుకునేలా యుద్ధవ్యూహం రచించి విజయం సాధించాను!

నాతో అన్ని విధాల సమ ఉజ్జీ అనిపించుకున్న చాళుక్య వీరభద్రుని నా తండ్రి అభీష్టం మేరకు వివాహమాడాను! ఇరువురు కుమార్తెలకు జన్మనిచ్చాను! చాళుక్య వీరభద్రునికి అప్పటికే ఇరువురు కుమారులున్నారు. అతడు కాకతీయ సామ్రాజ్యంపై కన్ను వేసి గణపతి దేవునికి పుత్రసంతానం లేదు కనుక తానే రాజు కాగలనని భావించాడు. తాను వృద్ధుడైన పిదప తన కుమారులైన హరిహర, మురారి దేవులకు కాకతీయ సింహాసనాన్ని కట్ట బెట్టాలని కుట్రచేయటం నేను సహించలేక పోయాను! ‘‘ఒక స్త్రీకి రాజ్యాధికారం – ఉండరాదు” అనుకునే ఆ దురహంకారం నాకు నచ్చలేదు! కాకతీయుల ఓరుగల్లు సింహాసనాన్ని పరాయివారికి ధారపోయటానికి అంగీకరించని స్వాభిమానం నాది!

నా తండ్రి అభీష్టం మేర వీరోచిత విద్యలను నేర్చి యుద్ధరంగంలో రాణించగల వ్యూహాలతో యుద్ధ పటిమతో అందరికీ సమాధానం చెప్పాలనుకున్నా! అజ్ఞాత శత్రువులెందరో దాడి చేయబోయినా విఫలం చేశాను. కత్తితో భీకరపోరాటం చేసి తగిన సమాధానం చెప్పాను. చోళరాజు రాజేంద్రచోళుడు, పల్లవరాజు కొప్పెరుంజింగడు, ఏరువ మల్లిదేవుడు, త్రిపురాంతకాన దాడులు చేసినా, సామంతులు తిరుగుబాటు చేసినా, అన్నిటినీ తిప్పి కొట్టాను. గూఢచార వ్యవస్థను పటిష్టం చేసి అప్రమత్తంగా పరిపాలన సాగించాను. రైతులను ప్రోత్సహిస్తూ సంతోషంగా వుండేలా వారి

సమస్యలను తీర్చాను! మహిళలకు అనేక అవకాశాలను కల్పించాను. నాలాగా యుద్ధవిద్యలు నేర్చేలా కొందర్ని తయారు చేశాను. అంబదేవుడు, గోనగన్నా రెడ్డి వంటి విశ్వాస పాత్రులు నాకు అండదండలుగానున్నారు. ఎన్నో విజయాలను సొంతం చేసుకున్నాను.

కేసి నాయకుల రాకిసి కోరలు పీకి
భల్లాల వల్లభు పండ్లు రాల్చి
పాండ్య రాజుల పంచబంగాళ మొనరించి
చోళభూవరుల గగ్గోలు పరచి,
కళ్యాణ దుర్గేశు గర్వమ్ము పోకార్చి
పూగినాటి నృపాలు పొగరణంచి
నాగ దేవుపట్టి నలినలిగా కొట్టి
కందమాల నృపాలు క్రిందుసేసితిని!

కేవలం ఆడదాన్ని జయించాలి అనే చులకన భావంతో హరిహర, మురారి దేవుల దురుప దేశ దుర్విషము నెత్తికెక్కి దేవగిరిరాజు ఏడు లక్షల సేనతో దండెత్తాడు.

కానీ తెలుగురాణి కరాన పచ్చలబాకు ఆ ప్రజాద్రోహి గుండెల్లో గుచ్చుకునే వేళ ఎంత పదునుగా వుంటుందో తెలియక వచ్చాడు!

ఈ తెనుగురాణి గళాన విజయలక్ష్మి వెంటనే కౌగలించుకుని వేసే ముక్తామాలను గూర్చి తెలియక వచ్చాడు

ఘనమైన వరాహలాంఛనంగల కాకతీయ స్త్రీ శక్తిని గూర్చి అంచనా లేక వచ్చాడు!

తెలుగురాణి విజయకింకిణుల ఘణంఘణల ధ్వనులు, ఖడ్గప్రహారపు ధ్వనుల గూర్చి తెలియ లేక వచ్చాడు!

శత్రుశీర్షాల కాలరాయగల కాకతిసామ్రాజ్ఞి గల గజ, వాజి, నివహాల గూర్చి ఎఱుగ లేక వచ్చాడు.

ఈ రుద్రదేవి భద్రపీఠిపై పేరాసతో దండయాత్రకు ఫలితాలను సరైన అంచనా వేయలేక వచ్చాడు.

ఈ వీర వనిత రుషారుణ నేత్రకాంతుల్లో కాలిపోతాననే సంగతి తెలియక వచ్చాడు.

నేను దేవగిరి రాజును ఎదిరించిన తీరు నా ఖడ్గ చాలనలోని వేగం స్త్రీ లోకానికే వన్నెతెచ్చి పురుషలోకం విస్తుపోయే అంశం అయింది సుమా! స్త్రీ భుజశక్తికి నిదర్శనమై నిలిచిన చారిత్రక ఘట్టం ఆనాటి సమరం.

అశ్వారోహణమున ఆరితేరి, ఖడ్గచాలనంలో నేర్పుచూపి, మృగయాఖేలనాన మేటియై, రాజనీతి శాస్త్రరీతులతేజరిల్లి, చతురుపాయాలలో చతురురాలనని, ధనుష్కళాకౌశలాన దక్షురాలననీ వైరి దుర్గ విచ్ఛేదనంలో నా శక్తి యుక్తులు తెలియక కొరివితో తల గోకుకున్నాడు.

నా ఖడ్గ చాలనా మాయాజాలంలో మట్టికరిచాడు అందుకే నిష్కారణంగా ఆడది కాబట్టి అవలీలగా జయించాలని వచ్చిన ఆ దురాశా పరునితో ఇలా అన్నాను.

అబలల పదాంబు జాతములంటి
వెంట నీడిగిలు వాడవీవు కాదేని వెడగ
ప్రణయదాసుండవో కాక ప్రళయదాసదాసుండవో
తేల్చుదాన సొంతముగ నేను (సొంతముగ నేను) – అని హుంకరించాను!
యాదవాన్వయుడగు
మహాదేవరాజు – తా మగువయని
చులకనగ జూచీ
మనసులో మగతనము పేరాసలాచీ
కత్తిగొని వచ్చి పడెనట నాడు
చిచ్చుమిసి వెడలితిని
విక్రమము వెడలినటు రూపెత్తీ
కదనరంగము నందు
కాళికారూపమై! ఏ యెడల నేనె కనిపించీ

యాదవుని ఆయువిక నిలవదనిపించీ

నాదు హుంకారాలతో

దేవగిరి వరకు తరమి కొట్టా

ప్రాణ భయంతో వాడు

‘‘తన శిరమ్మును వంచి

నా పాదమ్ములందు కీలించీ

వినయమున కోటి ధనరాసులను

కుప్పగా పోసెనట!

బతుకు పోరా!

తెలుగు పడతి అడిదపు వాడి

వ్రాయించుకో కావ్యమందూ

నీతిగా పాడు కో జీవితమ్మందూ – అంటూ ప్రాణభిక్ష పెట్టాను.

స్త్రీ ఒక మాతృమూర్తి! అంతమాత్రాన స్వాభిమానం, పరాక్రమంలేని అబల అనుకోవద్దు! ఆంధ్రవనిత దేశవైభవాన్ని రాణింపచేసే జ్వలించే దీపం!

తెలుగు తల్లి కీర్తికి

మహిళల భుజశక్తీ

ధీశక్తీ

రెండూ అవసరమే

మన తెలుగు తల్లికి మల్లెపూదండ!

**మల్లమ్మ:-** భళీ! రుద్రమ్మా! కాకలు తీరిన యోధులు సహితం అసమానమైన నీ పరాక్రమం ముందు తల వంచవలసినదే. నీకు నా శుభాభినందనలు.

**రుద్రమ్మ:-**మల్లమ్మ దేవీ! అసమాన దేశభక్తుడైన తాండ్రపాపారాయని సోదరివి నీవు. సామర్లకోట ఆడపడుచువు, దామర్ల వంశవృక్షానికి పూచిన పుష్పానివి. బొబ్బిలిసంస్థానాధీశుడైన రాజారంగరాయనిగారి ధర్మపత్నివై సమయోచితమైన మార్గదర్శకత్వం చేసిన ధీశాలినివి. రాజనీతివిశారదవు. “కార్యేషుమంత్రీ” అనే వాక్కు నీ పట్ల సార్థకం. నీ పతి భక్తి వెనుక దేశభక్తి సహితం మిళితమై ఉన్నది మల్లమా! ఈ

పవిత్ర ప్రాంగణంలో నిన్ను కలుసుకోవటం నా భాగ్య విశేషం. ఆనాటి ఉదంతాలు నీ అంతరంగాన్ని ఏ రీతిగా ప్రభావితం చేశాయో వినిపించు మల్లమా!

**మల్లమ్మ:-** రాణీరుద్రమా! శౌర్య ధైర్య సాహసాలలో భారతీయ మహిళలకు నీవే ప్రేరణ, ప్రోత్సాహం. నీవు అందించిన స్ఫూర్తియే నా కార్యదీక్షకు, సాహసానికి బాసటగా నిలచింది తల్లీ. వంశానుగతంగా రాజనీతిని నేను అవగతం చేసుకున్నాను. నీవన్నట్లు నా పతికి నేను సమయోచితమైన మెళకువలను, అందిస్తూ ఉండేదానను. అందువలన అటు మహారాజునకు, రాజ పరివారానికి, మంత్రి వర్గానికి, ప్రజల మన్ననలకు పాత్రురాలనయాను. ఆ కాలంలో బొబ్బిలి విజయ నగర రాజుల నడుమ విభేదాలు తీవ్రంగా సాగేవి. ఎడనెడ సంభవించే సంఘటనలు, కోడిపందేలు వారి నడుమ ద్వేషాగ్నులను మరింత ప్రజ్వలింపచేశాయి. క్రమక్రమంగా వర్తక వ్యాపారాలలోను, బంధువుల రాకపోకలలోను ఇరువురి నడుమ అఘాతం ఏర్పడింది. ఆ కాలంలోనే ఫ్రెంచివారు, ఆంగ్లేయులు భారతదేశంలో తమతమ వ్యాపారాదుల నిమిత్తమై అడుగుమోపారు. విజయ రామరాజు ఆంగ్లదొర బుస్సీతో మైత్రి నెరపి బొబ్బిలి సంస్థానాన్ని జయించే ప్రయత్నంలో తనకు సహాయ సహకారాలందించవలసినదిగా విజ్ఞప్తి చేశాడు. బుస్సీదొర ఆశీస్సులతో యుద్ధసన్నద్ధుడయాడు. బొబ్బిలిరాజు,

రాజా రంగరాయనిగారు విజయ రామరాజుతో సంధి ప్రయత్నాలు చేశారు. అవి నిష్ప్రయోజనాలయ్యాయి. ఆ తరుణంలో నన్ను పెను విషాదం ఆవరించింది. చిట్టచివరగా నా ప్రయత్నంగా చెలికత్తె లక్ష్మమ్మ ద్వారా విజయరామరాజుకు సందేశం పంపాను. నేను విజయరామరాజుకు సోదరి వంటిదాననని మా అనుబంధాన్ని స్మరించుకోవలసినదిగా వేడుకున్నాను. పరదేశస్థులను నమ్మి స్వీయ బంధు జనాన్ని అవమానింపదగని విన్నవించాను.

''గాజులు నల్లపూసలు నాకు నిల్పండి
బొట్టు, కాటుకా నిల్పుమయ్య ఓ విజయరామరాజా!
పసుపు కుంకుమ నిలుపుమయ్య ఓ విజయరామరాజా!
పూసల పాటి వారిల్లే నాకు పుట్టిల్లను కొంటీ''
దామర్ల వారి సంస్థానమే మరచిపోయినాను''

అని ప్రార్థించాను. నా రాయబారం విఫలమైంది. బొబ్బిలి కోట వెలుపల సాగిన ఘోర సమరంలో నాపతి రంగరాయని గారు వీరమరణం చెందారు. నా పతి మరణ వార్తను విన్న నేను హతాశురాలనయాను. నా బిడ్డను రక్షించుకోవాలని నిర్ణయించుకున్నాను. చెలికత్తె లక్ష్మమ్మకు అప్పగించాను.

''ఏ పేదతల్లి కడుపుననో
పుట్టిన నేని హాయినొందుదువు తనయా!
ఈ పాడు తల్లి కడుపున
నే పుట్టి పట్టి! యిడుములు పడితే''

అని ఆక్రోశించాను. నా బిడ్డను లక్ష్మమ్మతో రాజాం ప్రాంతానికి తరలించాను. శత్రురాజుల వశమైన కోటలో నేను నివసించి ఉండటం క్షేమం కాదు. ఎల్లప్పుడు పతిని అనుసరించిన నేను మృత్యువులోను పతిని అనుసరించటమే తగినదని భావించాను. రాజపత్నిగా, వీరవనితగా అదే నా ధర్మమని తలచాను. మా కులదైవమైన వేణుగోపాలుని తలచుకొని రాయుని గారి కత్తితో ప్రాణత్యాగం చేసుకున్నాను. రుద్రమా! మరుజన్మలో కూడ రాయుని గారినే పతిగా అనుగ్రహింపుమని స్వామిని వేడుకున్నాను. పతియే ప్రత్యక్షదైవంగా పతి అభ్యుదయమే తన లక్ష్యంగా భావించే తెలుగు సంస్కృతి మహోన్నతమైనది రుద్రమ్మా! నా చరితను, పాతివ్రత్యాన్ని మన్నన చేసి తెలుగుతల్లి గీతంలో నాకు స్థానం కల్పించటం నా పూర్వజన్మసుకృతం రుద్రమ్మా! వీరమాత అయిన తెలుగు తల్లిని మనసారా అర్చించుకునే భాగ్యం కలిగినందుకు ధన్యురాలను.

**రుద్రమ్మ:-** పతిభక్తి, పుత్రవాత్సల్యం ఒక వంక దేశాభిమానం ఒక వంక నింపుకున్న త్యాగమూర్తివి నీవు. నీ చరితం కడు శ్లాఘనీయం మల్లమ్మా!

**కలభాషిణి:-** సాధ్వీమణులారా! మీ గుణగణాలు, యుక్తిచాతుర్యం తెలుగు మహిళలకు శిరోధార్యాలు. మీకివే నా అంజలులు.

మన రుద్రమ్మ

'ఖడ్గ విద్యా ప్రవీణయై ఘనత కెక్కి
అరులనణచుటయందున నారితేరె''

ఇక మల్లమ్మ –

వెలమవీరుల శౌర్యంబు విడిచిపెట్టి

పడతిమల్లమ్మ పతిభక్తి ప్రస్తుతింతు''

(రుద్రమ్మ, మల్లమ్మలు నమస్కరిస్తారు.)

**కలభాషిణి:-** పారిషదులారా! బుద్ధి వైశారద్యంతో మంత్రాంగ వ్యూహరచనతో తెలుగు వారి ఘనకీర్తిని చాటి చెప్పిన అపర చాణుక్యుడు మహామంత్రి తిమ్మరుసు. తన ధీయుక్తితో భారతదేశ రాచరిక వ్యవస్థలో చెరగని ముద్ర వేసిన రాజకీయ చతురుడు. కృష్ణదేవరాయల కీర్తి సౌధానికి మూలస్తంభమైన వాడు.

అప్పాజీ అండదండలతో దక్షిణ భారతదేశంలో సువిశాల సామ్రాజ్య స్థాపన చేసిన విజయనగర చక్రవర్తి శ్రీ కృష్ణదేవరాయలు. సాహితీ సమరాంగణ సార్వభౌముడు. బహుగ్రంథకర్త. పలు భాషలు నేర్చిన పిదప ''దేశభాష లందు తెలుగు లెస్స'' అని సగర్వంగా చాటిన ధీరుడు. రాయల ఏలుబడిలో తెలుగు భాషాయోష నవరత్న కింకిణీఘలంఘలలతో అందలమెక్కి ఊరేగింది. తెలుగు చరిత్రలో ఘనకీర్తి వహించిన మంత్రివరేణ్యులు అప్పాజీ, ఆంధ్రభోజుడు రాయలు తెలుగుతల్లి మ్రోల అంజలి ఘటింప విచ్చేస్తున్నారు. మహా మహులారా! మీకు సాదర స్వాగతం –

( తిమ్మరుసు, కృష్ణదేవరాయలు వేదిక పైకి వచ్చి)

**ఇద్దరు:-** తెలుగుతల్లికి అభివాదాలు -

**కృష్ణ:-** అప్పాజీ! పితృ సమానులైన మీకు నమస్సులు. తెలుగు తల్లి లోగిలిలో, మాకు ఇలవేల్పు అయిన శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో మిమ్ములను దర్శించటం మాకెంతో ఆనందదాయకం.

**తిమ్మరుసు:-** ప్రభువులకు అభివాదాలు

**కృష్ణ :-** మహామంత్రి! హైందవధర్మ స్థిరత్వానికి విద్యారణ్యులవారు సంకల్పించి, నిర్మించిన మహా సామ్రాజ్యానికి ప్రేరణ నందించిన మహానుభావులు మీరు. ఆనాడు మీరు చేయి పట్టి నడిపించిన వైనం, సమ్రాట్టుగా మమ్ములను తీర్చిదిద్దిన సన్నివేశాలు నేటికీ కనులముందు సాక్షాత్కరిస్తున్నాయి. రాజ్య విస్తరణలో మీ వ్యూహరచన ప్రధాన భూమిక వహించింది అప్పాజీ! ఆనాడు పరదేశీయులను అణచివేసిన సందర్భాలలో మీరు ప్రయోగించిన చతురోపాయాలను స్మరించినప్పుడు మా అంతరంగం ఆనందంతో

పులకించిపోతుంది. ఆ ముచ్చటలు మీ పలుకులలో మరొక్కమారు స్మరింపచేయండి అప్పాజీ!

**అప్పాజీ:-** ప్రభూ! మీ రాజ్య విస్తరణ కాంక్షను ఎఱింగిన నేను పరుల జలదుర్గ, వనదుర్గ, గిరిదుర్గాదుల పటిష్టతలను గూఢచారుల ద్వారా తెలుసుకున్నాను. పరరాజ్యాలలోని ప్రజల మనోభావాలను, ఆయాప్రాంతపాలకులైన రాజులపై వారికి గల ఆదరాభిమానాలను అంచనా వేశాను. అన్నిటికి మించి దండయాత్రకు అనువైన సైనిక ఆత్మస్థైర్యం, చతురంగ బలసమీకరణ మొదలైన విషయాలపై శ్రద్ధాసక్తులను చూపాను. ఈ ప్రణాళికలు శత్రువులను ధైర్యంగా ఎదుర్కొని రాజ్య విస్తరణకు దోహదం చేశాయి.

**కృష్ణ :-** జ్ఞప్తికి వచ్చింది అప్పాజీ! పెక్కు సందర్భాలలో మమ్ములను కంటికి రెప్పవలె కాపాడటమే కాక మీధీయుక్తి చాతుర్యంతో శత్రురాజులు మనరాజ్యంపై కన్నెత్తి చూడటానికి భయపడే రీతిలో రాజ్యంలో శాంతి భద్రతలను సుస్థిరం కావించారు.

అంతేకాదు మహామంత్రి! మేము ఉమ్మత్తూరు పాళెగాండ్రను అణచి వేసే ప్రయత్నంలో సైన్య సమేతంగా కదిలాము. వారిని ఎదిరించలేక సైన్యం తటపటాయిస్తుంటే మీరు ప్రచండమైన బలసమీకరణ కావించి యుద్ధరంగానికి పంపారు.

**తిమ్మరుసు:-** ప్రభువుల అనుగ్రహం – సర్వ సర్వంసహా చక్రవర్తిగా ప్రభువులను దర్శించాలన్న కాంక్షయే నన్ను పురికొల్పింది

ప్రభూ! మరొక సంఘటన నాకు జ్ఞప్తికి వస్తున్నది. తీర ఆంధ్రప్రాంతాన్ని కైవసం చేసుకున్న పిమ్మట పొట్నూరులో జయస్తంభం నాటిన ప్రభువులు ఇనుమడించిన ఉత్సాహంతో కటకాన్ని స్వాధీనం చేసికోదలచి సైన్యాలను ముందుకు నడిపించారు. అది అంతా వన్యప్రాంతం. కటక ప్రభువులకు విశ్వాసపాత్రులైన మహాపాత్రోలు అక్కడ నివసిస్తూ మన సైన్యాన్ని ఎదుర్కొంటున్నారు. ఆగడ్డు పరిస్థితులలో ప్రభువులు కర్తవ్యం స్ఫురించక ఆలోచనామగ్నులయారు.

**కృష్ణ :-** అవును మహామంత్రి! ఆ తరుణంలో తరణోపాయం సూచించవలసినదిగా మిమ్ములను అర్థించాము మీ అపారమైన మేదశ్శక్తితో ఆ సమస్యను పరిష్కరించారు. గొప్ప పథకాన్ని సిద్ధం చేశారు.

ఆ పథకాన్ని ప్రయోగించటం వలన గజపతి ఆత్మరక్షణకై ఆ ప్రదేశం వదలి వెళ్ళిపోయాడు. మాతో సంధి ప్రయత్నాలు చేశాడు. తమ కుమార్తెను మాకు అర్పించి పరిణయం కావించాడు. శత్రువుల నడుమ వైరం రూపుమాపి వియ్యమందించిన అపార రాజనీతిజ్ఞులు తమరు మంత్రీ! రాజకీయధురంధరులు, సంగ్రామ ధనుంజయులే కాదు, రసజ్ఞులు, మహాపండితులు, అగస్త్యవిరచితమైన 'బాలభారత' గ్రంథానికి మీరు రచించిన 'మనోహరవ్యాఖ్య' అమిత మనోహరమే. ఇది మీ ధీయుక్తికి సారస్వత నిదర్శనం.

''తవిలి రాజ్య సంక్షేమంబు తలచువాడు
క్షితిపతికి సదా శుభము కాంక్షించువాడు
మెరయు బుద్ధిబలంబుతో మించువాడు
మంత్రిశేఖరుడయిన తిమ్మరుసు కాడె''

**తిమ్మరుసు:-** ప్రభువుల కీర్తి ప్రతిష్టలు సామాన్యమైనవా? తమరు విశిష్ట ప్రజ్ఞావంతులు. సాహితీ సమరాంగణ సార్వభౌములు, సామ్రాజ్యాధిపత్యం స్వీకరించిన తక్షణమే ప్రజాసంక్షేమం కోసం పాటు పడ్డారు. రాజ్యాన్ని సుభిక్షం కావించారు. అంగళ్ళ రతనాలు రాశులు పోసి అమ్ముకోగల సంపదను ప్రజలకు సమకూర్చారు. రైతు సంక్షేమం, సాంస్కృతిక వికాసం, వర్తక వ్యాపారాలు మూడుపూవులు ఆరు కాయలుగా విలసిల్లాయి. మీ ఏలుబడి కాలం ఒక సువర్ణయుగమై తెలుగుతల్లిని అలరింపచేసింది. భువన విజయ సభామండపంలో నెరపిన కవి పండిత గోష్ఠులు కవితా చమత్కారాలు, సకల కళాప్రవీణులను ఆదరించిన దృశ్యాలు జనులు గాథలుగా పాడుకున్నారు అదిగో! ఒకనాడు మీరు మహా శివభక్త కవి ధూర్జటి కవిత్వాన్ని ప్రశంసించిన సన్నివేశం –

''స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటి పల్కులకేల కల్గెనో
యతులిత మాధురీ మహిమ - ?

ధూర్జటి కవిత్వానికి ఇంతటి మాధుర్యం ఏ రీతిగా కలిగిందో అని మీరు ఆశ్చర్యాన్ని ప్రకటించినప్పుడు మన కొంటె వికటకవి తినాలిరామలింగడు చేసిన చమత్కారం జ్ఞాపకం ఉన్నదా ప్రభూ!

\- - - - హా తెలిసెన్ భువనైక మోహనో
ద్ధత సుకుమార వార వనితా జనతా ఘనతాపహారి సం

తత మధురాధరోదిత సుధారస ధారల గ్రోలుటంజుమీ''

**కృష్ణ :-ఆహా!** సంతత శివధ్యాన తత్పరుడైన ధూర్జటి సుకుమార వారవనితల అధరసుధారసాస్వాదన కావించాడనటంలో తెనాలి రామకృష్ణుడు ఎంతటి చమత్కారి?

**తిమ్మరుసు:-** మహారాజా! మీరు కవి పండిత పోషకులే కాక బహు గ్రంథకర్తలు కదా. సంస్కృతాంధ్ర తమిళ కన్నడ భాషలు మీకు కరతలామలకాలు. పలు సంస్కృత కావ్యాలు రచించిన మీరు శ్రీకాకుళాంధ్ర దేవుని ఆనతిపై ''ఆముక్తమాల్యద'' ప్రబంధాన్ని తెలుగుతల్లికి కానుకగా సమర్పించారు కదా. తెలుగు భాష తియ్యదనాన్ని తమరు ఆస్వాదించినట్లుగా మరొక రాజు ఆకాలంలో ఎవ్వరూ ఆస్వాదించలేకపోయారు.

**కృష్ణ :-** కలకండ అచ్చులు పోసిన భాష తెలుగు భాష

తెలుగదేలయన్న దేశంబు తెలుగేను

తెలుగు వల్లభుండ తెలుగొకండ

యెల్లలనృపులుగొలువ యెఱుగవే బాసాడి

దేశభాషలందు తెలుగు లెస్స!

ఎన్ని భాషలు నేర్చినా, మా ఘనకీర్తికి మూలమైనది తెలుగుతల్లియే కదా మహామంత్రి! ''తెలుగు వల్లభుని'' గా మమ్ములను అభివర్ణించుకోవటంలో అనిర్వచనీయమైన ఆనందం కలుగుతుంది. భాష పేరుతో సుప్రసిద్ధదేవతాయతనం వెలసిన పుణ్యభూమి మన తెలుగు భూమి. శ్రీకాకుళాంధ్రదేవునిగా కీర్తింపబడుతూ ఆముక్తమాల్యద విరచింపచేసిన ఆంధ్ర భాషామతల్లిని వేనోళ్ళ కీర్తిస్తున్నాను మహామంత్రి!

**తిమ్మరుసు:-** ''ఆముక్తమాల్యద'' ప్రబంధం విశిష్టాద్వైత సిద్ధాంత ప్రతిపాదకం. భక్తి, రక్తి, సామాజిక జీవనం, రాజకీయ చతురత, తాత్త్వికత పరిపూర్ణంగా పండించిన ప్రబంధరాజంగా సాహిత్య లోకంలో మీకీర్తిని సుస్థిరం చేసింది. పరమ భక్తుడైన విష్ణుచిత్తుని వృత్తాంతంలో, నిరతాన్నదాన విశిష్టతను నిరూపించారు. తెలుగు జాతి సంస్కృతిని, అతిథి మర్యాదలను ఎంత చక్కగా వర్ణించారు ప్రభూ!. వెలలేని మహోన్నతమైన మీ కీర్తికి మరొక కలికితురాయి మీరు పాటించిన పరమత సహనం. శైవ, వైష్ణవాలు రెండిటిని ఆదరించిన ఘనతమీది. పాశ్చాత్యులు సైతం మీ పరిపాలనకు ముగ్ధులై మీ కీర్తిని గ్రంథస్థం కావించారు.

మరొక్క మాట ప్రభూ! మీ ఏలుబడిలో నిర్మింపబడిన దేవాలయాలు భారతదేశ ఆలయ సంస్కృతికి ప్రతిబింబాలు. ఆంధ్రుల శిల్ప కళా నైపుణ్యానికి మచ్చుతునలకలు. “నేను చక్రవర్తిని కాను స్వామి భక్తుడను” అని నిరూపించిన రీతిలో దేవేరులతో కూడి తిరుమలలో ప్రభువులు అంజలి బద్ధులై స్వామిని కొలిచేవారు.నేటికీ దేవేరులతో కూడియున్న ప్రభువుల వారి శిలా ప్రతిమలు నాటి వైభవానికి తీపి గురుతులై విరాజిల్లుతున్నాయి ప్రభూ. అందుకే దిగంత పరివ్యాప్తమైన మీ ఘనకీర్తిని తన భావనా చమత్కృతితో స్తుతి చేసిన మొనర్చిన తెనాలి రామకృష్ణుని వాక్కులు నిలువెత్తు సత్యాలుగా నిలిచి ఉన్నాయి.

‘‘నరసింహకృష్ణరాయలకర
మరుదగు కీర్తి యొప్పు కరిభిద్ గిరిభిద్
కరికరిభిద్ గిరిగిరిభిద్
కరిభిద్ గిరిభిద్ తురంగ కమనీయంబై’’

**కృష్ణ :-** అప్పాజీ! మీరు నేర్పిన సంస్కారం, తెలుగు తల్లి వరంగా ప్రసాదించిన జ్ఞానమూ, నను కన్న తల్లి కానుకగా ఇచ్చిన ఆశీర్వచన సంపత్తి మా కీర్తికి ప్రబల హేతువులు. నా తల్లి నాగులాంబ పేరు చిరకాలం నిలిచి ఉండాలన్న కోరికతో ‘నాగులాపురం’ నిర్మించాను. కన్న తల్లి ఋణం తీర్చుకున్నాను. తెలుగుతల్లి వైభవానికి శాశ్వత స్థితిని కల్పించే సదాశయంతో ‘ఆముక్తమాల్యద’ను తెలుగుజాతి జీవన, సంప్రదాయాలకు అనుగుణంగా తీర్చిదిద్దాను.

జై తెలుగు తల్లీ ! జై తెలుగు తల్లీ!

**తిమ్మరుసు:-** జై తెలుగు తల్లీ ! జై తెలుగు తల్లీ!

**కలభాషిణి:-** ‘‘అయ్యా ! నీ సరియేరీ!

తియ్యని విలుకాడవయ్య తిమ్మరుసయ్యా!’’

అను ప్రశంస అక్షరసత్యం మహామంత్రీ!

(సభ వైపు తిరిగి)

అప్పాజీ, కృష్ణ దేవరాయల అనుబంధం అజరామరమైనది. ఆనాటి ముచ్చటలు తెలుగుజాతి ఉన్నంతకాలమూ నిత్యనూతనంగ జీవించి ఉంటాయి. తెలుగు జాతి వైభవాన్ని సువర్ణాక్షరాలతో చరిత్రలో లిఖించిన మహనీయులకు అభినందనలు.

''మంత్రులెందరు లేరొక్కొ మహిని చూడ
చక్రవర్తులు లేరొకొ జగతిలోన
తిమ్మరుసు కీర్తి ప్రతిభల దీప్తినొంది
కృష్ణరాయల సత్కీర్తి పృథివి నిలిచె.

తెలుగుకీర్తి అనన్యమూ, అప్రమేయమూనైనది. సాధ్వీశిరోమణులను మహాకవి పుంగవులను, ధీమంతులను ఎందరినో తన కడుపున కన్న బంగారు తల్లి మన తెలుగుతల్లి. భక్తి పారవశ్యంతో జన్మను పునీతం కావించుకున్న వేంగమాంబ, మొల్ల వంటి కవయిత్రిలలామలు, సంఘసంస్కరణకై ఉద్యమాలే ఊపిరులుగా జీవనం సాగించిన వీరేశలింగం, గురజాడ వంటి మహానుభావులు, ఆంధ్రరాష్ట్ర ప్రతిపత్తికై అసువులు బాసిన పొట్టి శ్రీరాములు వంటి జాతీయాభిమానులు తెలుగుగడ్డపై నడయాడారు. సుగంధ భరితమైన ఆ మహనీయులు కీర్తి, ఔదార్యాలనే తెలుగుతల్లికి మల్లెపూదండగా అలంకరిద్దాం. నిత్యమైన, సత్యమైన వారి కీర్తి గాథలను గీతాలుగా పాడుకుందాం.

భాషకంటె నవ్యులకు తపస్సు లేదు. పునర్జన్మ ఉంటే తెలుగే మాతృభాషగా జన్మించాలని కోరుకుందాం.

జై తెలుగుతల్లీ! జై తెలుగుతల్లీ!

# MAA TELUGU THALLIKI
# MALLE PUDANDA

(A Literary, Musical drama)



డా॥ వి. నాగరాజ్యలక్ష్మి

మా తెలుగు తల్లికి మల్లెపూదండ

మాకన్న తల్లికి మంగళారతులు

కడుపులో బంగారు, కనుచూపులో కరుణ

చిరునవ్వులో సిరులు దొరలించుమాతల్లి || మా తెలుగు ॥

గలగలాగోదారి కదలిపోతుంటేను

బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేను

బంగారు పంటలే పండుతాయి

మురిపాల ముత్యాలు దొరలుతాయి

అమరావతీ నగరి అపురూప శిల్పాలు

త్యాగయ్య గొంతులో తారాడు నాదాలు

తిక్కయ్య కలములో తియ్యందనాలు

నిత్యమై, నిఖిలమై నిలచియుండేదాక

రుద్రమ్మభుజశక్తి మల్లమ్మ పతిభక్తి

తిమ్మరుసు ధీయుక్తి కృష్ణరాయలకీర్తి

మా చెవుల రింగుమని మారుమ్రోగేదాక

నీయాటలే ఆడుతాం నీ పాటలేపాడుతాం

జై తెలుగుతల్లీ! జై తెలుగుతల్లీ!

--శంకరంబాడి సుందరాచారి.